
# మావూరి మద్దిగా బెర్లినగోడ

కె.యస్.ఎన్

"ఒరే పెద్దయ్యా! రా. రా. దమ్ముంటే యీ సర్పంచీ ఎలస్సన్లో సూసుకొందాం..."

అదే మా పెద్దయ్యతో ఆకరిగా నేను మాట్లాడిన మాట. కేక. టీ కొట్టు దగ్గరున్నోల్లంతా నావేపు నోరువిప్పి సూత్తున్నారు. చేతుల్లో 'టీగాసులు' పచ్చవాతం వచ్చినట్టుగా బిగుసుకుపోయాయి. గాసులు కడుగుతున్న సీతాలు కదలకుండా ఉండిపోయింది. ఒక్కస్సెనం పాటు అంతా నిస్సద్దం. ఈ నిస్సద్దం కేవలం నేను అరిసిన అరుపువల్ల వచ్చింది కాదు. గత రెండేల్లుగా సాప కింద నీరులా పాకుతూ వచ్చింది. అసెంబిలీ ఎలస్సన్లో ఈ దూరం మొదలయ్యింది. పాల సంగం, నీటి సంగం, సహకార సంగం ఎలస్సన్లో దూరం మరీ మరీ పెరిగింది. మండల ఎలస్సన్లో దూరం అగాదంగా మారింది.

ఇప్పుడు మా ఊల్లో రోడ్డు ఉత్తరం వైపు ఉన్నోల్లంతా తెలుగుదేశం. రోడ్డుకి దచ్చినాన ఉన్నోల్లంతా కాంగిరేసు. సుట్టుపక్కల ఉన్న ఊల్లన్నిటిలో మా ఊరే పెద్దది. డబ్బులో కూడా మా ఊరిదే పైచేయి. నాయుడు మాయ్యకాడ రెండొందలెకరాలూ, పెదబాబుగోరు కాడ రెండొందలెకరాలూ! రోడ్డుకి ఉత్తరంగా ఉన్న ఊరు కొత్తగా పెరిగింది. ఈ కొత్త ఊల్లోని ఎక్కువ యిల్లు తెలుగుదేశం అయాంలో కట్టినియ్యే. ఈ కొత్త యీదికి



పెత్తందారు పెదబాబుగోరే. పెదబాబుగోరు మా ఊల్లో పుట్టలేదు. ఇల్లరికానికి వచ్చి, రాజకీయంగా ఎదిగేడు. మొదట్లో కుర్రోల్లనీ, పెద్దోల్లనీ కలిపి నాటకాలు ఏయించేవోడు. పండుగలు సేయించేవోడు. తెలుగుదేశం పార్టీకి సేయూతగా సుట్టుపక్కల ఊల్లంనిట్లో పట్టుగొమ్మయ్యాడు. కొత్తీదిలో సాలా యిల్లు ఈయనగోరు పలుకుబడితో కట్టినియ్యే. పంటలకు యిత్తనాలు, లోన్లు... అన్నింట్లో తన మాటను పలికించాడు. అందుకే యియ్యాల కొత్తీదిలో ఆయనకు ఎదురులేదు. ఆయనకోసం పేనాలొడ్డెయ్యడానికి సిద్దంగా ఉన్నారు పెజలు.

రోడ్డుకి దచ్చినంగా ఉన్న ఊరు పాతూరు! ఒక సెట్టుకు పెరిగిన కొమ్మల్లా దగ్గిరి దగ్గిరిగా యిల్లు. ఒకరి కొంప నుంచి మరొకరి కొంపలోకి రాకపోకలు జరుగుతుంటాయి. అమ్మన్నక్క ఒంకాయ కూర సేత్తే మా యింటికి పంపిత్తాది. మాయమ్మ సేసిన కొబ్బరికాయ పచ్చడి నాయుడి మాయ్యింటికి ఎల్తాది. అమ్మలూ, అక్కలూ కలిసి ఒరిపిండి ఒడియాలు పెడతారు. ఆవకాయలో తీపీకారంలా ఒకరింటి పిల్లలు, మరొకరింటి పిల్లలతో కలిసిపోతారు. మా గేదెలకు గడ్డికోసం అయ్య నాయుడు మాయ్య సేలోకి ఎల్తాడు. వాల్ల టాకటేరు దుక్కదున్నడానికి సాయంగా వత్తాది. వాల్ల సేను నూరుపుకి సాయంగా అందరం ఎల్తాం. మా మద్దిన దాపరికాల్లేవు. కుల్లిబోత్తనాలంతకన్నా లేవు. ఎచ్చుతగ్గుల తేడాలు మచ్చుకన్నా లేవు. కస్టసుకాల్లో ఒకలికొకలం. ఇదే.. ఈ పాతూల్లో పెద్దలదగ్గిరి నుంచీ వత్తున్న ఆచారం. అందుకే ఇక్కడ నాయుడు మాయ్యే నాయకుడు. .ఆయన పలుకంటే బెమ్మపలుకు. ఆయన మొదటినుంచీ కాంగిరేసు పాట్టీనే నమ్ముకున్నాడు.

ఊల్లో రోడ్డుకి అటేపు కిల్లీకొట్టు, కిరానా కొట్టు, యిటేపు టీకొట్టు, సైకిలు సాపు... ఊరికి దూరంగా సారా కొట్టు, పేకాట పంచ...., ఊరి మద్దిన కోయెల, ఊరాతల సూలు, పాలకేందరం, పసువులాస్పటలూ, మనుసులాస్పటలూ, యియన్నీ అందరికీ! ఈటికి మద్దిలో ఏ రోడ్డూ పోలేదు. పొద్దున్నే టీకొట్టు కాడ గంటసేపు కూర్సుని 'టీ' తాగేటోల్లం. ఈ గంటలో ఏ యింటో ఎంత కట్టం, ఎవడి పొలంలో ఎంత నట్టం... గుట్టలూ, గొడవలూ అన్నీ పెనంమీద ఏపి తత్తరించుకునేటోల్లం. ఈ మద్దిలో అప్పుడప్పుడూ 'కుల్లి కోంటమ్మ' (కుర్రోల్లు పెట్టిన ముద్దుపేరు) గారెలు. ఏడి, ఏడి టీ; కారం గారిలు. సలసల ఉడుకుతున్న మా మాటా-మంతీ! అలా టీ తాగి పొద్దున్న యిడిపోయేటోల్లం. పొద్దుకునికేపాటికి బుల్లిమాయ 'కిల్లీకొట్టు'కాడ కలుసుకునేటోల్లం. మాయన్నయ్య సుట్టా, నేను బీడీ ఎలిగించేవోల్లం. సాయిమాయ్య సోడా కొట్టమనేవోడు. సీరాంగోడు జర్దాకిలీల కట్టమనేవోడు. బాబులు సిన్నాన్న పెసాదు బావ, తాతయ్యలు తాత, ఒకరిద్దరు మాస్టర్లూ... అంతా గుమ్ముగూడేటోల్లం! పొద్దున్న కారాలూ మిరాలూ నూరినోల్లం, యిప్పుడు ఒకేపుకు సేరేవోల్లం. యిల్లరికపు అల్లుల్లను ఆటపట్టించడం, సెడుగా తిరిగేవోల్లను ఎగతాలిసేయడం,



పేకాటలో పెతిసారీ ఓడిపోతున్నా పట్టువదలని విక్రమార్కుల్లను గెలిసేయడం , సదువుకుంటోన్న కుర్రోల్లను పొగడడం... రోడ్డు పక్కనే సిన్నసిన్న గోనెలపై కూరలమ్ముతోన్న రైతులు..., కిరానాకొట్టో సరుకులూ, గరమసాలా కొంటున్న అమ్మలూ, పిల్లలూ... ఈలోగా సారా కొట్టో సీసా ఎక్కించి పేలుతూ, తూలుతూ వత్తున్న నరసింలూ, ... యిదీ

చీకట్లు కమ్ముకునేసరికి ఎవలింటికి వాల్లు. రేతిరి అన్నం. నులకమంచంపై ఒల్లు తెలీని కునుకు. అంతా నిస్సబ్దం. తెల్లారి జామును కోడికూసిందాక, మా నోటి గురక తప్ప, ఆ నిస్సబ్దాన్ని కాదనే ఏ అలజడీ ఉండేది కాదు.

మా అయ్యలు ముగ్గురన్నదమ్ములు. సాలా కాలందాకా మా అయ్యలంతా కలిసికట్టుగా పొలాలు సేసుకొనేటోల్లం. ఒకే పెద్దింట్లో యిరుగు పొరుగై పక్కపక్కన ఉండేవోల్లం. మా పెద్దయ్య వోల్ల అమ్మాయి... అదే మా పెద్దక్క సిదగ్గొట్టిన పలకలపై సిన్నప్పుడు నేను రాసుకునేవోణ్ణి. నేను సించేసిన సంచిలో మా తమ్ముడు పలక పెట్టుకుని బల్లోకి

పెదబాబుగోరి పారిటీవోల్లు బూతుకాడికెల్లి, ఎగస్పారిటీ వోల్లు ఓటెయ్యడానికి ఒక్కడుగు ముందుకేసినా... కాల్లు నరికెయ్యమని ఎచ్చరిక! నాయుడు మాయ్యగోరి పారిటీ వోల్లు 'ఓటెయ్యండిరా! అడ్డంపడినోడి తల తెగనరుకుతామని' సవాలు!! ఊరంతా గుమ్మిగూడిపోయింది.

వొచ్చేవోడు. ఒకలిగిన్నిలో మలొకలం ఉప్పుమా తినేటోల్లం. సిన్నప్పుడు యింటుబెల్లికి ఫైడియ్యగోడు నన్ను కొట్టినప్పుడు, వాన్ని మాయక్క ఎలా తిట్టిందంటే... ఆ తరువాత నా యేపు సూసే దమ్ము లెవడికీ లేకపోయినాయి. యింట్లో ఎవలన్నా తప్పు సేత్తే పెద్దయ్య మందలించేవోడు. మాయింటో మాట ఎక్కడా బయటకి పొక్కేది కాదు. ఏదో కంటికి కనబడని సత్తి ముగ్గురన్నదమ్ముల మొత్తం కుటుంబాన్ని కలిపి నడిపేది. ఒకలు మరొకలిపై పెత్తనం సెలాయిత్తున్నట్టు మాకెప్పుడూ అనిపించేది కాదు. ఎందుకంటే ఎప్పుడూ మాకెవలకీ ఎలాంటి లోటూ తెలిసేది కాదు

ఈయాలకి సరిగ్గా అయిదేల్లు. మా పెద్దయ్య కోలనీలో యిల్లు కట్టుకుని పూర్తిగా మకాం మారిసేసాడు. మా సిన్నయ్య వేరే సోటికి ఎల్లిపోయేడు. మా తాత కట్టినిల్లు మాకే ఒదిలేసి వాల్లెల్లిపోయేరు. ఆయాలనించీ రాకపోకలు తగ్గినై. ఊల్లో కూడా కొత్తకొత్త రాజకీయాలు. కొత్తకొత్త నాయకులు. కొత్తకొత్త పారిటీలు. వాల్లిద్దీ కిల్లీకొట్టుకెదురుగా మా యీది లోనూ కిల్లీకొట్టు ఎట్టారు. టీ కొట్టు కూడా రెండు ముక్కలయింది. కిరానా కొట్టు, కూరల బడ్డీ, సైకిలు సాపూ, సారాకొట్టూ, పేకాట పంచా... అన్నీ రెండు రెండయ్యాయి? ఏ వీదివోల్లు ఆ యీదిలోనే కొంటున్నారు. రోడ్డుకి అటు వాల్లు అటే! యిటువాల్లు యిటే! పంతాలూ, పట్టింపులూ, పగలూ, పెతీకరాలూ అన్నీ సెరిసగమే!! పెదబాబుగోరు, నాయుడు మాయ్య మాటాడుకోడం మానేశారు. ఒక్కో కుటుంబంపై రెండేసి జెండాలు రెపరెపలాడుతున్నాయి. మా అయ్యా, పెద్దయ్యా మాటాడుకోడం మానేశారు. ఎర్రిబాబు కూతురి మొగుడు ఎగస్పారిటీలోకి పోయాడు. కుల్లి కోంటమ్మ గారెలు కొత్తిదిలో పొరసం పెంచుతున్నాయి. వంటాకుల సిన్నగోడి పకోడీలు పాతీదిలో పరుగులు పెట్టిత్తున్నాయి. రెండేపులా సారా బుడ్డీలు అలుపు లేకుండా జనాల్ని అరిపిత్తున్నాయి. కరిపిత్తున్నాయి.

మా ఊల్లో ఎప్పుడు ఏ గొడవొచ్చినా నాయుడు మాయ్యే తీరిసేవోడు. అవునన్నోల్లేగాని, కాదని ఎదురుతిరగలేదెవలూ. మొగుడూ – పెల్లాం గొడవలూ, అన్నదమ్ముల గొడవలూ, కట్టనం గొడవలూ, బూమి గొడవలూ, డబ్బు గొడవలూ... అందరికీ అన్నీ నొప్పిలేకుండా సెప్పేసేవోల్లు. అందరూ సంతోసంగా ఊకొట్టేవోల్లం. గుడిసిలో పొగ గుడిసిలోనే సల్లబడిపోయేది. ఊర్లో దూలి ఊల్లోనే సచ్చుబడిపోయేది. కానీ పోయినేడాది సరిగ్గా యిదే సమయం. నీటి సంగం ఎలస్సన్లో మా ఊల్లోకి తొలీతగా పోలీసోడొచ్చాడు. నేనప్పుడు దాకా టీవీల్లో పోలీసోన్ని సూడడమేగాని, కాకీబట్టలు – ఎర్రటోపీ ఎట్టుకున్న మనుసుల్ని ఎదురెదురుగా సూడలేదు. నన్ను నేనే నమ్మలేకపోయాను. అటేపూ – యిటేపూ జరిగిన దెబ్బలాటలో పది మందిని జీపెక్కించారు. తలలు పగిలినోల్ల తల్లులు ఏడుత్తున్నారు. ఒల్లు సిదిగినోల్లకు పెల్లాలు మద్దనాలు సేత్తున్నారు. ఏ దెబ్బలూ లేనోల్లు,పోలీసుల కంటబడనోల్లు కత్తులు యిప్పిన పుంజుల్లా సెలరేగుతున్నారు. వచ్చే ఎలస్సన్లో సూసుకుందామంటాడొకడు. అప్పుడు దాకెందుకురా' అంటాడింకొకడు. పల్లెటూల్లో పగలు పొగలు సిమ్ముతున్నాయి. ఆ తరవాత పెతీ ఎలస్సనూ ఈ పొగలతోనే కమ్ముకుపోయేయి. విద్దాకమిటీ ఎలస్సన్లో కూడా కొట్టాటలూ, పోలీసులు, యిడిపించడాలూ –

సర్పంచీ ఎలస్సనకి యిప్పిడికే కత్తులు కట్టారు. ఎగతాలులూ.. ఏవగింపులూ... తిట్టులూ... కయ్యాలూ... ఈయాలా, ఆయాలని లేదు. పెతిరోజూ యిదే సంబరం. సిన్నోల్లూ, పెద్దోల్లూ అని లేదు. ఆడోల్లూ, మగోల్లూ అని లేదు. పెతి నోటా యిదే ఊసు. పొయ్యిలోకి పుల్లలు ఎలుతున్నా లేకపోయినా – ఈదిలో మాత్తరం కర్రలు కటకటలాడుతున్నాయి. ఊల్లో ఎవలి ముకంలోనూ పచ్చదనం లేదు. నిప్పులు చెరుగుతున్న కల్లుతో ఒకరికొకలు పలకరించుకుంటున్నారు. రాత్తుల్లు మా ఊల్లో పోలీసులు గస్తీలు తిరుగుతున్నారు. ఊల్లో ఏ యింట సూసినా ఒకేమాట – పెదబాబుగోరా? నాయుడు మాయ్యా?? మా ఊరి మద్దిగా పోతున్న రోడ్డుమీద మాత్తరం సోరాపేకెట్టు పోలిటీన్లు ఎగురుతున్నాయి. టీకొట్టు, గారెల బడ్డీల అమ్మకాలు పెరిగిపోయాయి.

మా బల్లో పిల్లోలికి మాత్తరం యిదేమీ పట్టినట్టు లేదు. రోడ్డు మీద తూలుతున్న పాలిటీన్‌సెలను కాలుతో తన్నుతూ ఆడుతున్నారు. గూనీ – బిల్లా ఆడ్డానికని రోడ్డుకటేపోల్లూ – ఇటేపోల్లూ జట్టులు కడుతున్నారు. పిల్లోడూదిన బూర యువతలింటి ముంజూరు నుంచి అవతలింటి పెంకులపై పడింది. పిల్లోలికంతా ఒకటే సందడి. సర్పంచి ఎలస్సన్లకి సెలవులిచ్చారని.

పొద్దుపొద్దున్నే ముసులోలంతా ఓటెయ్యడానికి వరసగట్టారు. సూలు బయట సీటులు రాస్తున్నోల్లంతా అడావుడిగా వున్నారు. ఆడోల్లూ – మగోల్లూ వరసలో ఎల్తున్నారు. పోలింగేజెంటు ఓ ముసలోన్ని పట్టుకుని దొంగోటన్నాడు. ఓటర్లిస్టులో పేరు లేదంటాడు. ఓటెయ్యడానికి వీల్లేదంటాడు. తిరుగు ముకం పట్టినోల్లు రోడ్డు పొడుగునా తిట్టుకుంటూ ఎలుతున్నారు. వరసలో ఉన్న ఓటర్లలో గుసగుసలు. పోలింగ్ ఏజెంటుల రుసరుసలు. కాసేపిట్లో బూతు దగ్గిర గొడవ. అడవిలో అగ్గిలా ఊరంతా పాకిపోయింది. పెదబాబుగోరి మనసులంతా టాకటేరు ఏసుకుని ఒచ్చారు. నాయుడు బాబుగోరి మనుసులు కూడా టాకటేరు మీదొచ్చారు. కర్రలూ... కత్తెలూ! పెదబాబుగోరి పారిటీవోల్లు బూతుకాడికెల్లి, ఎగస్పారిటీ వోల్లు ఓటెయ్యడానికి ఒక్కడుగు ముందుకేసినా... కాల్లు నరికెయ్యమని ఎచ్చరిక! నాయుడు మాయ్యగోరి పారిటీ వోల్లు 'ఓటెయ్యండిరా! అడ్డంపడినోడి తల తెగనరుకుతామని' సవాలు!! ఊరంతా గుమ్మిగూడిపోయింది. కల్లుమూసి తెరిసే లోపు బూతు దగ్గిర రంకెలేత్తున్న జనం – కర్రలూ... కత్తెలూ! రాల్లూ... సీసాపెంకులూ!! మా ఊరిని యిడగొడుతున్న రోడ్డు, పోలింగు బూతు దగ్గిర జనాన్నీ యిడగొట్టింది – కొత్తీదివోల్లంతా ఉత్తరం ఏపు! పాతీదివోల్లంతా దస్సినం ఏపు!! తిట్టులూ, కేకలతో మొదలయింది – సర్దిచెప్పాలని పోలీసులు సేలా సెమపడ్డారు. కానీ సుకం లేకపోయింది. రాల్లను బంతుల్లా యిసిరారు. కొంతమంది తలల నుంచి నెత్తురు జల్లులు. సీసాపెంకులు యిసిరారు. కర్రలూ.. కత్తులూ జులిపించేరు. అక్కడికక్కడే యిద్దరు నేలకొరిగారు. కాసేపు రెండేపుల నుంచీ నిస్సబ్దం. లెక్క సూసుకునేసరికి అటో పదీ, యిటో పదీ దెబ్బలు తగిలి మూలనపడ్డారు. అటో యిరవై, యిటో ఇరవై ఊసలెనెక్కల్లారు. ఊరంతా వల్లకాడు. ఏడుపులు... పెడబొబ్బలూ...!

పెదబాబుగోరూ, నాయుడు మాయ్యా – యింటింటికీ ఎల్లి పలకరిత్తున్నారు. అందినంతా సాయం సేత్తున్నారు. పల్లూ, కాయలూ సేతికిత్తున్నారు! మా పెద్దయ్య తల పగిలినందుకు మా పెద్దమ్మ నన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతోంది. నా సేత్తో నే నెవలిమీదా రాయిసరలేదు. కానీ ఆయాల టీ కొట్టుకాడ నేనిసిరిన మాట మాత్తరం నన్ను జేలుకూడు తినమంది. కాకీబట్టల పోలీసోన్ని రోజూ సూసేలా సేసింది.

మా ఊరిలో ఎలస్సను రద్దయిపోయింది. పోలింగు బూతుపై రెండు పారిటీల జెండాలు రెపరెపలాడుతున్నాయి. నెత్తురుతో మడుగయిపోయిన మా ఊరి నేల, నిస్సబ్దంగా సినుకుకోసం ఎదురు సూస్తోంది. మా ఊరి మద్దిగా 'బెర్లిన్ గోడ'లా పోతున్న రోడ్డు మాత్తరం సానుబూతితో నవ్వుతోంది!

★